క్లుప్తంగా

మంచినీటి చెరువులు పూర్తిగా నింపండి



గుడివాడ టౌన్(నందివాడ):మండలంలోని అన్ని గ్రామాల మంచినీటి చెరువులు పూర్తి స్థాయిలో నింపాలని నందివాడ తహసీల్దార్ భావన్నారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని గ్రామాల్లో పర్యటించి చెరువుల్లో నీటి మట్టాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ తాగు నీటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో నీటిని నింపుతున్నామన్నారు. అందులో భాగంగానే కుదరవల్లి గ్రామంలో చెరువులో నీటి మట్టాలను పరిశీలించామన్నారు. గ్రామ సర్పంచులకు, కార్యదర్శులకు దీనిపై ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఏమేరకు అమలుచేస్తున్నారనేది తెలుసుకునేందుకు ఈ పర్యటన చేపట్టామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్, వైఎస్సార్ సీపీ నాయకులు వసంతల కృష్ణ, గుజ్జుల లాజరు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి విరాళం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి దాతలు ఆదివారం విరాళాలు అందించారు. ముదినేపల్లికి చెందిన ఈడ్పుగంటి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారుడు ప్రభు రూ.10,116 విరాళాన్ని స్వామి సన్నిధిలో ఆలయ ప్రధానార్చకుడు తోలేటి వీరభద్రశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం కావడంతో సుబ్బారాయుడిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేశారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించడంతో పాటు నాగబంధాలకు, గోకులంలోని గోవులకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శొంఠినాగరాజు, సహాయ కమిషనర్ ఎస్.సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

లింగాలలో విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

మండవల్లి: మండలంలోని లింగాలలో కొలువై ఉన్న గంగా విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు మే 3వ తేదీ నుంచి 5 వరకు జరగనున్నట్లు కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ఉదయం 9 గంటలకు స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడిగా, పెండ్లి కుమార్తెను చేయడం, 4న రాత్రి 8 గంటలకు దివ్యకల్యాణ మహోత్సవం, 5న గ్రామోత్సవం జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ మహోత్సవాలను తిలకించాలని కోరారు.

నేడు కైకలూరులో అసెంబ్లీ స్థాయి స్పందన కార్యక్రమం

కైకలూరు: నియోజకవర్గ స్పందన కార్యక్రమం కై కలూరు సీఎన్నార్ గార్డెన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని తహసీల్దారు బి.మురళీకృష్ణ ఆదివారం చెప్పారు. ఏలూరు జిల్లా కలెక్టరు వె.ప్రసన్న వెంకటేష్‌తో పాటు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండిపర్రు సర్పంచ్ వినయ్ కుమార్ మృతి



కొండిపర్రు(పామర్రు): గ్రామ సర్పంచ్ మట్టా వినయ్‌కుమార్ (49) ఆదివారం ఆకస్మికంగా గుండె పోటుతో మృతి చెందారు. వినయ్‌కుమార్ కుమార్తె హైదరాబాద్‌లో గత కొంత కాలంగా ఉంటోంది. ఆమెను చూసేందుకు వారం రోజుల క్రితం సర్పంచ్ హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచి తర్వాత ఆయన వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేసిన వ్యక్తి మృతి చెందడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. అందరితో కలిసిపోయి ఎంతో సంతోషంగా ఉండే వారని వాపోయారు. ఆయనకు భార్య ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని సోమవారం హైదరాబాద్ నుంచి తీసుకొస్తామని కుటుంబసభ్యులు చెప్పారు.

విశ్వేశ్వరస్వామి కల్యాణానికి ఎమ్మెల్సీకి ఆహ్వానం

మండవల్లి: మండలంలోని లింగాల గ్రామంలో కొలువై ఉన్న గంగా విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో మే 4న జరిగే దివ్యలీలా కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఆహ్వానించారు. ఈఓతో పాటు చైర్మన్ రాజులపాటి యశోదనరావు, ధర్మకర్త ఓలేటి నాగరాజు ఆహ్వానించినవారిలో ఉన్నారు.

ఆధునిక హంగులతో పీఏసీఎస్‌లు

- రైతులకు విస్తృతంగా సేవలు
- శాశ్వత భవనాల నిర్మాణం
- 15 సంఘాల్లో రూ. 3.11 కోట్లతో పనులు
- విద్యార్థుల విదేశీ విద్యకు సైతం రుణాలు



పామర్రులో నూతనంగా ఆధునీకరించిన కేడీసీసీ బ్యాంకు భవనం

పామర్రు:రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయంతో పాటు సహకార రంగాన్ని అన్ని విధాలుగా బలోపేతం చేస్తోంది. ఇతర బ్యాంక్‌లతో పోలిస్తే సహకార బ్యాంక్‌ల్లో తక్కువ వడ్డీకే రుణాలు పొందేలా అవకాశం కల్పిస్తోంది. ఏళ్ల తరబడి కునారిల్లుతున్న సహకార సంఘాల భవనాలను ఆధునికీకరిస్తోంది.

పామర్రు నియోజకవర్గంలో....

నియోజకవర్గంలోని నార్త్ వల్లూరు, మొవ్వ పాలెం, మొవ్వ, చాగంటిపాడు, రొయ్యూరు, ధూళిపూడి పాలెం, కూచిపూడి, అమీనాపురం, చినముత్తేవి, జమీ గొల్వేపల్లి, పెదమద్దాలి, హనుమంతపురం, ఉండ్రపూడి, పమిడిముక్కల గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో మరమ్మతులతో పాటు నూతన భవన నిర్మాణాలు బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, స్థానిక శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ చొరవతో చేపట్టారు. సుమారు 15 సంఘాల్లో రూ. 3.11 కోట్ల నిధులతో శిథిలావస్థలో ఉన్న వాటిని తొలగించి నూతన భవనాల ఆధునికీకరణ పనులు, మీటింగ్ హాలు, కొత్త గోడౌన్‌లు నిర్మిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయని సహకార సంఘాల అధ్యక్షులతో పాటు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్పత్తుల భద్రతకు గోడౌన్ల సదుపాయం...

గత ప్రభుత్వం చేయలేని విధంగా రైతులు తాము పండించిన ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్(ఎంపీఎఫ్‌సీ) గోడౌన్‌ను నిమ్మకూరు, జమీగొల్వేపల్లి, నార్త్ వల్లూరు, మొవ్వపాలెం, మొవ్వ, చాగంటిపాడు, రొయ్యూరు, ధూళిపూడిపాలెం, కూచిపూడి, అమినాపురం, చినముత్తేవి గ్రామాల్లో గోడౌన్‌ల నిర్మాణ పనులు చేపట్టారు. కూచిపూడి, నార్త్ వల్లూరు, మొవ్వ పాలెం, మొవ్వలలో ఆఫీసు నిర్మాణం పనులు సాగుతున్నాయి. జమీగొల్వేపల్లి, పెదమద్దాలి, హనుమంతపురం, ఉండ్రపూడి, పమిడిముక్కల గ్రామాల్లో శిథిలమైన భవనాల ఆధునికీకరణతో ఆధునిక హంగులు ఏర్పాటు చేసుకుంటున్నాయి. స్ట్రాంగ్ రూమ్‌లు, లాకర్ సదుపాయం, బంగారు ఆభరణాలకు రుణాల సౌకర్యంతో పాటు అత్యాధునికమైన క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

రూ.3.11కోట్లతో అభివృద్ధి పనులు

జిల్లా సహకార కేంద్రబ్యాంక్ పాలక వర్గం వచ్చిన 20 నెలల కాలంలోని నియోజకవర్గంలోని సంఘాలకు సుమారు రూ.3.11 కోట్లు మంజూరు చేశారు. నూతనంగా నిర్మించిన సహకారం సంఘాల్లో క్యాష్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూంలు, లాకర్లు, గోల్డు రుణ సౌకర్యం కల్పించి సంఘాల వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు.

రైతులకు విశేష సేవలే లక్ష్యం



వ్యవసాయం, సహకార రంగాలకు సీఎం సమ ప్రాధాన్యం ఇస్తూ రైతులకు విశేషమైన సేవలు అందిస్తున్నారు. సహకార సంఘాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా ఎకరానికి రూ.8లక్షల రుణాలు ఇవ్వటంతో పాటు విద్యార్థుల విదేశీ విద్యకు ఏ బ్యాంక్‌లూ ఇవ్వని విధంగా రుణాలు అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో లేని విధంగా అభివృద్ధి చేస్తున్నాం.

–కైలే అనిల్‌కుమార్,
పామర్రు శాసన సభ్యులు

గోడౌన్ల నిర్మాణం చేశాం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సహకార సంఘాలు ఎంతో అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. నియోజకవర్గంలో శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ కృషితో రూ.3.11 కోట్లతో నూతన సహకార సంఘాల భవనాల నిర్మాణం, మరమ్మతులు, గోడౌన్ల నిర్మాణాలు చేపట్టాం.

–తన్నీరు నాగేశ్వరరావు,
కేడీసీసీ బ్యాంక్ చైర్మన్

అడిగిన వెంటనే రుణం



గతంలో రుణం కావాలంటే నెల రోజులు తిరిగినా ఫలితం ఉండేది కాదు. ప్రస్తుతం అడిగిన వెంటనే అన్ని అర్హతలు ఉంటేవారం రోజుల వ్యవధిలోనే రుణం అందిస్తున్నారు. నేను 5 ఎకరాలకు గాను రూ.20 లక్షల రుణం తీసుకున్నాను. సక్రమంగా చెల్లిస్తుండటంతో ఎప్పుడు కావాలన్నా అప్పుడు రుణం ఇస్తున్నారు.

–బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి,
రైతు పామర్రు

ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ



పెదపూట్లపూడి పెద్దింట్లమ్మ జాతరలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కై కలూరు: ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని ప్రశాంత జీవనం గడపాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కలిదిండి మండలం పెదపుట్లపూడిలో జరుగుతున్న పెద్దింట్లమ్మ జాతరలో ఇద్దరూ ముఖ్యఅతిథులుగా ఆదివారం పాల్గొన్నారు. గ్రామస్తులు గజమాలలతో సత్కరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. క్రమం తప్పకుండా జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు. కలిదిండి వ్యవసాయ మార్కెట్ అధ్యక్షులు ఐనాల బ్రహ్మాజీరావు, సర్పంచ్ మోకా రామకృష్ణ, కొండంగి ఎంపీటీసీ ఇమ్మనేని లక్ష్మణరావు, మూలలంక సర్పంచ్ మహాదేవ విజయబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు నామాని అన్నవరం, నడకుదిటి ఏసుబాబు, నడకుదిటి గణపతి, తిరుమాని నాగరాజు, పడవల శ్రీను, ముద్దం రామకృష్ణ, ఇమ్మనేని రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ



పందిరిపల్లిగూడెంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సన్మానం

కైకలూరు: పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు కొల్లేరు ప్రజలను అన్ని విధాలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా పందిరిపల్లిగూడెం గ్రామంలో ఎమ్మెల్సీ జయమంగళకు సత్కారాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు డప్పు వాయిద్యాలు, పూలమాలతో ఘనస్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ బలే వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ కొల్లేరు ప్రజలకు పాదయాత్రలో ఎమ్మెల్సీ కేటాయిస్తానని హామీ ఇచ్చారన్నారు. నేడు జయమంగళకు ఎమ్మెల్సీ కేటాయించారన్నారు. కొల్లేరు ప్రజల సర్వతోముఖాభివృద్ధికి వైఎస్సార్ సీపీ కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ మాటతప్పని నేత సీఎం జగన్ అని చెప్పారు. కొల్లేరులో పేదలకు భూముల పంపిణీ జరుగుతోందన్నారు. కొల్లేరు ప్రజలందరూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కొల్లేరు నాయకులు ముంగర నరసింహారావు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ఎంపీటీసీ సభ్యుడు బలే నరేష్, సయ్యపురాజు గుర్రాజు, బలే సముద్రుడు, ఘంటసాల సీతారామాంజనేయులు, త్రిమూర్తులు, సైదు దుర్గారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



వీధి చిరువ్యాపారులకు గొడుగు అందజేస్తున్న శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ సభ్యులు

పామర్రు: వాసవీ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ పర్యటనలో భాగంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రీజనల్ చైర్‌పర్సన్ చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొని సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లబ్‌ద్వారా మరిన్ని సేవలు నిర్వహించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవాలని కోరారు. వాసవీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రసాదాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఆలయ వద్ద గల జాతిపిత, అమరజీవి విగ్రహాలకు నివాళులర్పించామన్నారు. పూటుకూరి ఎస్‌వీహెచ్ పిచ్చేశ్వరరావు లత దంపతుల సౌజన్యంలో విజయవాడరోడ్డులో చలివేంద్రం ప్రారంభించామన్నారు. కంచర్ల వీర జనార్ధన రావు ఉషారాణి , తాళ్లూరి వెంకట కృష్ణారావు, జానకీ దంపతుల వితరణతో వీధి వ్యాపారుల నీడ ఏర్పాటు కోసం గొడుగులు పంపిణీ చేశామన్నారు. యెండూరి వెంకట భవాని గుప్తా భారతీదేవి దంపతుల సౌజన్యంలో శివాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. వాసవీ వృద్ధ శరణాలయలలో గాంధీజీ, పొట్టి శ్రీరాములు, కేసీ గుప్తా విగ్రహాలకు నివాళులర్పించి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశామన్నారు. క్లబ్ అధ్యక్షుడు చిన్నం ఆదినారాయణమూర్తి, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పరిశ నాంచారయ్య, పీఆర్వో బొగ్గరపు సాయిబాబు, సభ్యులు దివ్వెలశివయ్య, ఘంటసాల భరతుడు, కొత్తశివమోహన పుల్లారావు, ఘంటసాల సాయిరాం పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



గ్రామసర్పంచ్ అంజిబాబును సన్మానిస్తున్న విద్యా కుటుంబసభ్యులు

పామర్రు(పమిడిముక్కల):గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల పాఠశాల వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్యాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ముళ్లపూడి గ్రామసర్పంచ్ పక్కాల అంజిబాబు, మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, హనుమంతపురం సర్పంచ్ కలపాల రాంబాబును పాఠశాల విద్యాకుటుంబ సభ్యులు సన్మానించారు. హెచ్‌ఎం పార్థసారథి, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పూరు మాజీ సర్పంచ్ తిరుమలశెట్టి బోసుబాబు, నాయకులు యేనుగ వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి రాజయ్య, గంధం రాంబాబు, పిప్పళ్లసరళ, ఐనంపూడి పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, కృష్ణాపురం హెచ్‌ఎం దేవరపల్లి కోటయ్య, మానవతా సంస్థ సభ్యులు పక్కాల వికాస్, శ్రీకరన్, గ్రామ పెద్దలు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రశేఖరరెడ్డి దంపతులకు సత్కారం



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ఎన్జీఓస్ నాయకులు

గుడివాడ టౌన్(నందివాడ):నందివాడకు చెందిన ప్రముఖ వ్యాపారి కొండపల్లి చంద్రశేఖరరెడ్డి దంపతులను ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. నందివాడలోని కె కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు సత్కార కార్యక్రమం చేపట్టారు. హయత్‌నగర్ లయన్స్‌క్లబ్ శాఖ అధ్యక్షుడిగా రెండవ పర్యాయము ఎన్నికైన నేపథ్యంలో ఆయనను సత్కరించినట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ ఫరీద్ బాషా, జి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఉంటున్న చంద్రశేఖర్‌రెడ్డి నందివాడ అభివృద్ధిలో తనదైన శైలిలో సహకరిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామానికి చెందిన చంద్రశేఖరరెడ్డి ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు ప్రపంచ సేవా ఆర్గనైజేషన్‌గా గుర్తింపు పొందిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వకారణమని చెప్పారు. ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ నాయకులు మలిరెడ్డి కృష్ణారెడ్డి, సరెళ్ల నాగేశ్వరరావు, ఎన్జీఓస్ అసోసియేషన్ నాయకులు అప్పారావు, పీవీఎస్‌వీ ప్రసాద్, పి.పాపయ్య, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమ్మకు నివాళి

మండవల్లి: మండలంలోని భైరవపట్నం సర్పంచ్ పి.సామ్రాజ్యవాణికి ఆదివారం మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి అన్నమ్మ (86) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బి.రత్నకుమార్ కానుకొల్లు హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, బీజేపీ నాయకులు ఎల్.వీరశివాజీ, ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు సంతాపం ప్రకటించి నివాళులర్పించారు.

ఘనంగా వాసవీమాత జయంతి



పామర్రు కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహిస్తున్న భక్తులు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



కన్యకా పరమేశ్వరీ అమ్మవారి చేస్తున్న పూజలు



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

పామర్రు:వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఘనంగా వాసవీ మాత జయంతి నిర్వహించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో, నవరసాలతో ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. శత సహస్ర నామాలతో విశేషంగా భక్తుల చేత పూజలు చేయించారు. అనంతరం ఆలయంలో లలితా సహస్త్ర నామ పారాయణ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో 108 దీపాలతో అమ్మవారికి హారతులు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొగ్గరపు జాలయ్య, కార్యదర్శి మానేపల్లి రఘురాం, సభ్యులు బొగ్గరపు సాయిబాబు, చిన్నం ఆదినారాయణ, కంచర్ల జనార్ధనరావు, తాళ్లూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్‌లో వేంచేసియున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి అభిషేకాలు చేసిన అనంతరం చండీహోమం చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి నగరోత్సవం కనుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ దేవస్థానం అస్తుల పరిరక్షణ కమిటీ సభ్యుడు భయ్యా శ్రీనివాస్, దుర్గామల్లేశ్వరస్వామి బోర్డు సభ్యులు మారం వెంకటేశ్వరరావు, ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి పూజలు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో వేంచేసియున్న కన్యకా పరమేశ్వరీ అమ్మవార్ల జయంతిని ఆర్యవైశులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు పీటలపై కూర్చుని కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరీ ఊరేగింపు

గుడ్లవల్లేరు: కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి పంచాయన క్షేత్రంలో అమ్మవారి జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను వేద పండితులు నిర్వహించారు. అమ్మవారిని గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలతో కొనసాగిన ఈ ఊరేగింపునకు మహిళా భక్తులు అడుగడుగునా పండ్లు, టెంకాయలను సమర్పించి నీరాజనాలు అర్పించారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం కుదరవల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గుడివాడకు చెందిన పెలికాన్ ఆసుపత్రి వైద్యులచే నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేకించి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచిత మందుల పంపిణీతో పాటు వైద్య సలహాలు అందించారు. డాక్టర్ రోజా, వైద్యసిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి మొక్కుబడుల చెల్లింపు



గుడ్లవల్లేరు:కౌతవరంలో తొమ్మిదేళ్లకు ఒకసారి జరిగే మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. సంప్రదాయ బద్ధంగా గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి కనక డప్పుల వాయిద్యాలతో భక్తులు మొక్కుబడులు చెల్లించేందుకు తండోపతండాలుగా తరలి వచ్చారు. అమ్మవారికి పండ్లు, టెంకాయలను సమర్పించి దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆలయంలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు:కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

రైతులకు కల్టివేటర్లు పంపిణీ



రైతులకు వ్యవసాయ పనిముట్లను అందిస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు:రైతన్నకు వెన్నుదన్నుగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. డోకిపర్రు ఆర్బీకేలో రూ.15 లక్షల విలువైన మూడు కల్టివేటర్లు, పది రోటోవీటర్లను ఆదివారం ఆయన చేతుల మీదుగా రైతులకు అందించారు. రూ.15 లక్షల్లో 50 శాతం మేరకు రూ.7.50 లక్షల రాయితీని వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్ కనుమూరి రామిరెడ్డి, ఎంపీపీ కొడాలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆటపాక ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

కై కలూరు: పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 150 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకున్నారు. దీనికి ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. పాఠశాలలో 1993–1998 మధ్య పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాలలోనూ ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో స్థిరపడ్డారు. ఆదివారం వీరందరూ ఒకే చోట సమావేశమయ్యారు. చదువుకున్న పాఠశాలకు రూ.10 వేలు విలువ చేసే కుర్చీలను వితరణగా అందించారు. అనంతరం జబర్దస్త్ కమెడియన్ కృష్ణప్రసాద్ చేసిన మిమిక్రి, యాంకరింగ్ మిత్రులను అలరించింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జితేంద్ర, మురళీ, విజయ్, బాలాజీ, శ్యామ్, భూషారావు, శ్రీహరి, దాసు, అరుణ, శారదా, అన్నపూర్ణ, జోస్నా మాదవి, లత తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు పార్వతిసమేత సోమేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 4 నుంచి 6 వరకు జరుగుతాయని ఆలయ చైర్మన్ గుల్లిపల్లి సుధారాణి, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. 4న స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా చేయడంతోపాటు విఘ్నేశ్వరపూజ, పంచగవ్యం, దీక్షాధారణ, ధ్వజారోహణ, 5న రుద్రాభిషేకం, బలిహరణ అనంతరం రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 6న పూర్ణాహుతి, త్రిశూలస్నానం అనంతరం స్వామివారి ఊరేగింపు నిర్వహించి అఖండ అన్నసమారాధన చేస్తామన్నారు. కార్యక్రమాలన్నీ పెదతుమ్మిడికి చెందిన బ్రహ్మశ్రీ సోమరాజుపల్లి ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో శైవాగమోక్తంగా జరుగుతాయని, ఉత్సవాలను స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొంటారని చెప్పారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): ఎర్ర చెరువు సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహా స్వామి వార్షిక కళ్యాణం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వార్ల కల్యాణంలో 33 మంది దంపతులు పీటల పీద కూర్చొంటారని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.